నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 26 అక్టోబర్ 2024 | SURYAPET

## 20 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్ డ్యాం క్రస్ట్ గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నందికొండ, అక్టోబర్ 25 : నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో డ్యామ్ 20 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 2,08,862 క్యూసెక్కుల వరద నీరు సాగర్‌కు వచ్చి చేరుతున్నది. దాంతో శుక్రవారం 20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,60,740 క్యూసెక్కుల నీటిని దిగువకు చేశారు. ఎడమ కాల్వ ద్వారా 5,727 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 10,120, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,475, వరద కాల్వ ద్వారా 400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నారు. మొత్తం 2,08,862 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది.

# ట్రిపుల్ ఆర్‌పై అలుపెరుగని పోరు

### త్రీజీ నోటిఫికేషన్లు వచ్చినా ఎక్కడా తగ్గని పోరాటం

**రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్)పై నిర్వాసితులు అవిశ్రాంత పోరాటం చేస్తున్నారు. త్రీజీ నోటిఫికేషన్ విడుదలైనా వెనుకడుగు వేయకుండా ఉద్యమం ఉధృతంగా కొనసాగిస్తున్నారు. నాడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖం చాటేయడంపై మండిపడుతున్నారు. అవార్డు ఎంక్వైరీ విచారణకు ఒక్క రైతు కూడా హాజరు కాకుండా తమ ఐక్యతను చాటుకున్నారు. రాయగిరి రైతులు మరోసారి హైకోర్టు ఆశ్రయించి న్యాయం కోసం పోరాటం చేస్తున్నారు.**

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ)

**వెనుకడుగు వేయకుండా ఐక్యంగా రైతుల ఉద్యమ బాట**

**వరుసగా అవార్డు ఎంక్వైరీ సమావేశాల బహిష్కరణ**

**రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఆందోళనలు**

**డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన రాయగిరి రైతులు**

**నాడు హామీ ఇచ్చి.. నేడు మొహం చాటేస్తున్న కాంగ్రెస్ నేతలు**

చౌటుప్పల్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భూనిర్వాసితులు

ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించారు. ఉత్తర భాగంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా మీదుగా 59.33 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించనున్నారు. దీని పరిధిలో తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలు ఉన్నాయి. 34 గ్రామాల మీదుగా రహదారి వేయనున్నారు. రాయగిరి, చౌటుప్పల్ వద్ద ఇంటర్ ఛేంజ్ జంక్షన్లు నిర్మించనున్నారు. 1,927 వేల ఎకరాల భూమిని సేకరించనున్నారు. మరో 188 ఎకరాల కోసం చౌటుప్పల్ వద్ద జంక్షన్ కోసం రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు.

### అన్ని చోట్లా సమావేశాల బహిష్కరణ

భూ సేకరణకు ఉత్తర భాగంలో ఏర్పాటు చేసిన 8 కాలా(కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ ఆక్విజేషన్)లో అన్నింటిలోనూ త్రీజీ నోటిఫికేషన్ విడుదలయ్యాయి. ముఖ్యంగా ఇటీవల చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి మండలాల్లోని గ్రామాలకు త్రీజీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో భాగంగా తాసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో గ్రామాల వారీగా అవార్డు ఎంక్వైరీ కోసం సమావేశాలు ఏర్పాటు చేయగా, ఎక్కడా భూ నిర్వాసితులు అధికారులకు సహకరించ లేదు. సమావేశాలను అడ్డుకుని, రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. మూడు రోజులుగా చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో ట్రిపుల్ ఆర్ బాధితులు సమావేశాలను బహిష్కరించి, ధర్నా చేస్తున్నారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోనూ ఆర్డీఓ కార్యాలయంలో అవార్డు ఎంక్వైరీకి ఒక్క రైతు కూడా హాజరు కాలేదు. నిర్వాసితుల కోసం ఏర్పాట్లు చేసి, ఎంతోసేపు ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయింది. ఏ ఒక్కరూ అధికారులకు వివరాలను సమర్పించ లేదు. ఈ నెల 30 వరకు సమావేశాలను బహిష్కరిస్తామని అన్ని గ్రామాల రైతులు స్పష్టం చేస్తున్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని, లేదా నిర్వాసితులకు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని, కానిపక్షంలో బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చేది లేదని మొదటి నుంచి రాయగిరి రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే నాలుగైదు సార్లు తమ విలువైన భూములను కోల్పోయామని, ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వబోమని భీష్మించారు. ఇక్కడి రైతులు యాదగిరిగుట్ట విస్తరణ, హైటెన్షన్ వైర్లు, గ్యాస్ పైప్‌లైన్, జాతీయ రహదారి నిర్మాణం సమయంలో విలువైన భూములను కోల్పోయారు. ఇప్పుడు కొద్దిపాటి భూమికి కూడా ట్రిపుల్ ఆర్ రూపంలో ముప్పు వచ్చి పడింది. దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. 32 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. దాంతో రాయగిరి భూ సేకరణపై స్టే విధించింది. సీఎం రేవంత్ రెడ్డి ట్రిపుల్ ఆర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించడంతో జిల్లా ఉన్నతాధికారులతోపాటు ఎన్‌హెచ్ఏఐ అధికారులు కోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం వాదనలు విన్న సింగిల్ బెంచ్ జడ్జి ఈ నెల మొదటి వారంలో స్టేను కొట్టేశారు. దాంతో రైతులు మరోసారి డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. విచారణలో ఉన్నట్లు తెలుస్తున్నది.

**మరోసారి హైకోర్టుకు రాయగిరి రైతులు..**

### ఆగని పోరాటం..

ఓ వైపు అధికారులు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నా రైతులు మాత్రం పోరాటాలను వీడడం లేదు. ఎప్పటికప్పుడు ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తూనే ఉన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌తోపాటు అనేక మంది నేతలను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంటి ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఉదయాన్నే వందలాది మంది అక్కడికి చేరుకుని మంత్రిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. తనకేమీ తెలియదని, అంతా సీఎం రేవంత్‌రెడ్డి చూసుకుంటున్నారని మంత్రి చేతులెత్తేశారని రైతులు మండిపడుతున్నారు. ఆ తర్వాత మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కలిసి తమ గోసను వినిపించారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పట్టించుకోవడం లేదని రైతులను ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో నిర్వాసితులు సమావేశాన్ని బహిష్కరించడంతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

### ముఖం చాటేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ తమను నమ్మించి నట్టేట ముంచిందని ట్రిపుల్ ఆర్ బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాయగిరి రైతులను ఎన్నికల్లో మోసం చేశారని మండిపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తాని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకాగాంధీతోపాటు అప్పటి ఎంపీ, ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. రాయగిరి రైతుల ఉద్యమాలకు మద్దతుగా నిలిచే ప్రయత్నం చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ట్రిపుల్ ఆర్ రైతులను అస్సలు పట్టించుకోకుండా మొహం చాటేస్తున్నారు.

# సూర్యాపేట జిల్లాపై సుడా పిడుగు

### 5 మున్సిపాలిటీలు, 264 పంచాయతీలను కలుపుతూ ఏర్పాటు

- పురపాలక శాఖ ఆధ్వర్యంలో జీఓ విడుదల
- నామమాత్రంగా మారనున్న మున్సిపాలిటీలు, పంచాయతీలు
- ఏ చిన్న అనుమతి కావాలన్నా సుడా కార్యాలయానికి వెళ్లాల్సిందే..
- స్థానిక సంస్థల ఆదాయానికి భారీగా గండి

సూర్యాపేట, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం సూర్యాపేట జిల్లాను యూనిట్‌గా తీసుకుని ఏర్పాటు చేస్తున్న సూర్యాపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)జిల్లా ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. జిల్లాలోని 5 మున్సిపాలిటీలు, 21 మండలాల పరిధిలోని 264 గ్రామ పంచాయతీలను కలిపి సుడా ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే పురపాలక పరిపాలన శాఖ జీఓ నెంబర్ 176ను విడుదల చేసింది. హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాలను కలుపుతూ హుడా ఏర్పాటు చేయడంతో అక్కడ ఎంతో అభివృద్ధి జరిగిందని ఉదాహరణగా చెప్తూ సూర్యాపేటను జిల్లా యూనిట్‌గా తీసుకుని సుడా ఏర్పాటుకు నిర్ణయించింది. కానీ, వాస్తవంలో రాష్ట్రానికి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌కు, ఇతర జిల్లాలకు ఎంతో తేడా ఉంటుంది. జిల్లాలో మొత్తం 486 గ్రామపంచాయతీలకు గానూ సుడా కిందికి 264 పెద్ద గ్రామ పంచాయతీలు, సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలను తీసుకున్నారు. ఇప్పటివరకు మున్సిపాలిటీల్లో చైర్మన్, కౌన్సిలర్లు, పంచాయతీలకు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాలక వర్గాలు ఉండగా.. ఇకపై అంతా ఉత్సవ విగ్రహాలుగా మారనున్నారు. సుడాకు రాజకీయ పార్టీ నుంచి నామినేటెడ్ చైర్మన్ రానుండగా అధికారాలన్నీ చైర్మన్ చేతికి వెళ్లన్నాయి.

### చిన్న పనికైనా సుడాకే..

ప్రస్తుతం గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఏ పని కావాలన్నా స్థానిక సంస్థలకే వెళ్తుండగా, సుడా ఏర్పాటుతో ఎలాంటి పని కోసమైనా ఆ కార్యాలయానికే వెళ్లాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఓ చిన్న ఇల్లు నిర్మించుకోవాలంటే ఇప్పటి వరకు సెక్రటరీ అనుమతి ఇవ్వగా, ఇకపై సుడా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక లేఅవుట్లు, డ్రైయినేజీలు, రోడ్లు వేయాలన్నా, ఎలాంటి అభివృద్ధి పనులు కావాలన్నా సుడాను ఆశ్రయించాల్సిందే.

### సుడాతో అభివృద్ధి ఎండమావే..?

జిల్లాలోని దాదాపు 70 శాతం ప్రాంతాలను కలుపుతూ సుడాగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి ఎండమావిగానే మారుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు భవన నిర్మాణ అనుమతులు, తాగునీరు, ఇంటి పన్నులు ఇలా పలు రకాల ఆదాయం వస్తుండగా వాటితో అభివృద్ధి పనులు చేస్తూనే ఉద్యోగులు, సిబ్బంది జీతభత్యాలకు వినియోగిస్తున్నారు. సుడా ఏర్పాటుతో పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఇప్పుడు వచ్చే ఆదాయం 10 శాతం కూడా రావడమే గగనమే. ఇప్పటికే భువనగిరి జిల్లాలో వైటీడీఏ ఏర్పాటు కాగా, కొన్ని గ్రామాలు హెచ్ఎండీఏ, కొన్ని వైటీడీఏలో ఉన్నాయి. దాదాపు ఆరు కోట్ల రూపాయలు నెలల తరబడిగా అటు హెచ్ఎండీఏకు, ఇటు మున్సిపాలిటీకి ఇవ్వకుండా వైటీడీఏ వద్దే ఉంటున్నట్లు సమాచారం.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి

### ప్రతి ఏఈఓ 150 ఎకరాలకు డీడీలు కట్టించాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ సిటీ, అక్టోబరు 25 : ఆయిల్ పామ్ సాగుపై రైతులను ప్రోత్సహించాలని, నవంబర్ 10లోపు ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో కనీసం 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు పెంచేందుకు రైతులను గుర్తించి డీడీలు చెల్లించేలా చూడాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఆయిల్ పామ్ సాగుపై ఏర్పాటు చేసిన శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. ఆయిల్ పామ్ తోటలతో రైతులు నష్టపోయేది అన్నారు. సాగు సులభమని, పంట చేతికి వచ్చాక కొనుగోలు చేస్తారో, లేదోనన్న ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందే తోటలు పండించిన రైతులతో ఒప్పందం చేసుకుని ధరను సైతం నిర్ణయిస్తుందని చెప్పారు. జిల్లాలో 10వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉందని, వ్యవసాయాధికారులు మరో 15 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెంచితే సంక్రాతి నాటికి జిల్లాలో ఆయిల్ ఫామ్ కంపెనీ ఎక్కడ పెట్టాలో ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.

వర్షాల నేపథ్యంలో మందగించిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సాయిబాబా, శ్రవణ్, ట్రైనర్ సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, మైక్రో ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్లు, పతంజలి ఫుడ్స్ ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని లతీఫ్ షా ఉల్లా ఖాద్రీ ఉర్సుకు జనం పోటెత్తుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆ ప్రాంతం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

# అవుట్ సోర్సింగ్‌లో అంతా ఇష్టారాజ్యం

- కాంట్రాక్ట్ కేటాయింపుల్లో నిబంధనలకు నీళ్లు
- అర్హత లేని ఏజెన్సీలకు అందలం
- అర్హత ఉన్న ఏజెన్సీలు హోల్డ్‌లో పెట్టిన వైనం
- అధికార పార్టీ నాయకులకు దాసోహం!

సూర్యాపేట, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగులు అక్రమాలు, అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకునే ఉన్నతాధికారులే కంచే చేను మేసినట్లు వ్యవహరిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఏజెన్సీల కేటాయింపుల్లో ఇది స్పష్టంగా కనిపిస్తున్నది. అర్హత ఉన్న ఏజెన్సీలను హోల్డ్‌లో పెట్టి, అధికార పార్టీ నాయకులకు దాసోహం అంటూ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని ఏజెన్సీలను అందలం వేస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను థర్డ్ పార్టీ కాంట్రాక్ట్(అవుట్ సోర్సింగ్) ఏజెన్సీలకు కేటాయిస్తుంటారు. జిల్లాలో ఏజెన్సీల కేటాయింపుల్లో పారదర్శకత పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారులకు ఇష్టం ఉంటే అర్హత లేని ఏజెన్సీలను కూడా దొంగదారిన తెచ్చి కేటాయించడం లేదంటే హోల్డ్‌లో పెట్టడం జరుగుతుంది.

నిబంధనల ప్రకారం ఏదైనా శాఖలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఉద్యోగాలు కేటాయించాలంటే సదరు ఏజెన్సీకి ఫర్మ్ రిజిస్ట్రేషన్, జీఎస్‌టీ రిజిస్ట్రేషన్, కాంట్రాక్ట్ లైసెన్స్‌తో పాటు ఆరు నెలల పాటు పీఎఫ్, ఈఎస్ఐ ఇచ్చి ఉండాలి. ఏజెన్సీ కచ్చితంగా రూ.25 లక్షల టర్నోవర్ కలిగి ఉండాలి. ప్రస్తుతం ఇవన్నీ ఉన్న పలు ఏజెన్సీలకు ఈసారి ఒక్క ఏజెన్సీ కూడా దక్కకపోవడం గమనార్హం. అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి అర్హత లేని ఏజెన్సీలకు కట్టబెట్టినట్లు తెలుస్తున్నది.

### దరఖాస్తు చేయని ఏజెన్సీలు ఎంప్యానల్‌లోకి ఎలా?

2023-24 సంవత్సరానికి సంబంధించి 2023 అక్టోబర్‌లో 40 ఏజెన్సీలు దరఖాస్తులు కొనుగోలు చేయగా అందులో మూడు ఏజెన్సీలు అసలు టెండర్లు వేయలేదు. మరో ఏజెన్సీ టెండర్‌తోపాటు డీడీ జత చేయకపోవడంతో రిజక్ట్ పొందలేదు. ఈ లెక్కన ఎంప్యానల్‌లో 36 ఏజెన్సీలే ఉండాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా టెండర్ వేయని నాలుగు ఏజెన్సీల నుంచి మధ్యలో డీడీలు తీసుకొని ఎంప్యానల్‌లో చేర్చారు. ఈ వ్యవహారంలో ఒక్కో ఏజెన్సీ నుంచి లక్షల రూపాయలు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటికే ఉన్న కొన్ని ఏజెన్సీలను తొలగించి పైవాటిల్లో మూడు ఏజెన్సీలకు ఏకంగా పలు శాఖలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఈ విషయంపై అధికారులు అక్రమాలకు పాల్పడుతూ తమకు అన్యాయం చేశారని బాధితులు కోర్టు మెట్లు ఎక్కగా, నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన కాంట్రాక్ట్‌లను రద్దు చేసి పాతవారినే కొనసాగించాలని ఉత్తర్వులు వచ్చాయి. అయినా అధికారుల్లో స్పందన లేదు.

### పదే పదే ఆ అక్రమాలు

2024-25 సంవత్సరానికి గానూ ఈ నెలలో టెండర్ ప్రక్రియను ప్రారంభించగా, ఎంప్యానల్‌లో 40 అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను చూపిస్తున్నారు. వాస్తవానికి గతంలో టెండర్ వేయని ముగ్గురితో పాటు టెండర్‌లో పాల్గొని డీడీ జత చేయని ఏజెన్సీలను తొలగించి 36 మందితో ఎంప్యానల్ ఉండాల్సి ఉండగా, గత సంవత్సరం అర్హత పొందని నాలుగింటితో కలిపి మరో పదిహేను చేర్చారు. వీటిలో చాలా ఏజెన్సీలు నిబంధనల మేరకు లేవని తెలుస్తున్నది. కొన్నింటికి జీఎస్టీ రిజిస్ట్రేషన్ లేకపోగా, చివరి ఆరు నెలలపాటు పీఎఫ్, ఈఎస్ఐ ఇచ్చిన ఏజెన్సీలు కూడా లేవు. 25 లక్షల టర్నోవర్ సర్టిఫికెట్‌కు యూడీఐఎన్ నెంబర్ లేకుండా ఫేక్ సర్టిఫికెట్ పెట్టినట్లు ఘనులూ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే అర్హత లేని ఏజెన్సీలకు కొన్ని బాధ్యతలు అప్పగించగా, మరికొన్ని అప్పగించేందుకు లావాదేవీలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# పశుగణన పారదర్శకంగా చేపట్టాలి

### సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

పశుగణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 25 : పశుగణనను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేధ మందిరంలో 21వ జాతీయ పశుగణన పోస్టర్‌ను పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావుతో శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో అక్టోబర్ 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 2 వరకు పశు గణన జరుగుతుందన్నారు. ఒక నోడల్ అధికారిని, 37మంది సూపర్‌వైజర్లు, 139 మంది ఎన్యూమరేటర్లు, పారా సిబ్బంది, గోపాల మిత్రలు ఈ పశుగణనలో పాల్గొంటారని తెలిపారు. గేదెలు, ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులు, గాడిదలు, గుర్రాలు, బాతులు, కుక్కలు, కుందేళ్లు వంటి 16 రకాల పెంపుడు జాతుల వివరాలు సేకరిస్తారన్నారు. తప్పులు లేకుండా లెక్కించాలని, వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని సూచించారు. ఉదయం పూటే పశుగణనను ప్రారంభించాలన్నారు. అవసరమైతే గ్రామస్థాయి అధికారుల సాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ వెంకన్న, డాక్టర్ పెంటయ్య, పశు సంవర్ధక వైద్యులు, సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజుల కోసం ర్యాలీ

- టీఆర్‌వీఎస్‌వీ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

సూర్యాపేటలో ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 25 : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంటు సందీప్, ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ అనేక కళాశాలలు స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యార్థులకు బోధన అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు చామకూరి మహేందర్, ఉపాధ్యక్షుడు ధరావత్ తరుణ్, పట్టణాధ్యక్షుడు సిలోజు గౌతమ్, ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.